క్లుప్తంగా

మంత్రి రోజా పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.టి.ప్రసాద్ తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం మంత్రి రోజాతో పాటు ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రసాద్ ఇంటికి వెళ్లి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య కుమార్తె వివాహానికి హాజరై డిప్యూటీ సీఎం నారాయణస్వామి నూతన వధూవరులు స్వర్ణ, సురేష్‌బాబును ఆశీర్వదించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు మునిచంద్రారెడ్డి, బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఎంపీటీసీ రోసిరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి నాయకులు, బొజ్జారెడ్డి, కోలార్ ప్రకాష్ ఉన్నారు.


ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ భవానీ

కార్వేటినగరం: సక్రమంగా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని డిప్యూటీ కలెక్టర్ భవానీ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటు హక్కు–పౌరుడి బాధ్యత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ భవానీ మాట్లాడారు. ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. ఓటరుగా నమోదు కావడానికి ఓటరు హెల్ప్‌లైన్ యాప్ వెబ్‌సైట్ ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ రవి కుమార్, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్ కుమార్, డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

స్విమ్స్ ఐసీటీసీకి ఎన్ఏబీఎల్ అవార్డు



ఐసీటీసీ సిబ్బందిని సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ హెచ్ఐవీ టెస్టింగ్ ల్యాబ్ (ఐసీటీసీ)కి న్యూఢిల్లీకి చెందిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెడికల్ (ఎంట్రీ లెవెల్) టెస్టింగ్ ల్యాబ్స్ వారు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ క్యాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. స్విమ్స్ ఐసీటీసీ ద్వారా మెరుగైన ప్రయోగశాలలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తుందని గుర్తించారు. పరికరాల అమరికలు, రికార్డులు, నివేదిక, నిర్వహణ కచ్చితమైన ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా బుధవారం అవార్డును తీసుకున్న ఐసీటీసీ సిబ్బందిని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు.

తిరుమలలో తమిళనాడు మహిళ అదృశ్యం

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన దంపతుల్లో భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేశాడు. తిరుమల వన్‌టౌన్ పీఎస్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు జిల్లా, తిరుత్తణికి చెందిన జయరామన్ పుణ్యకోటి, జ్యోతిలక్ష్మి(58) దంపతులు ఈ నెల 22న తిరుమలకు వచ్చి శ్రీవారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం బయటకు వచ్చి భక్తుల రద్దీతో విడిపోయారు. దీంతో భర్త ఆమె కోసం వెతికినా కనపడలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును నమోదు చేశారు. అదృశ్యమైన మహిళకు చెవుడు, నత్తి ఉంది. మహిళను గుర్తిస్తే 08772289027 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రమంతా సంక్షేమ సంబరం

- వైఎస్సార్‌సీపీ పాలనకు జై కొడుతున్న జనం
- వాడవాడలా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- మంచి జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించండి: వైఎస్సార్‌సీపీ నేతలు





పెనుమూరు : సంక్షేమ పథకాల కిట్లను అందిస్తున్న మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, వెదురుకుప్పం: పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ సంబరం కొనసాగుతోందని, అది సీఎం జగనన్నతోనే సాధ్యమైందని నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు మండల పరిధిలోని పులికల్లు సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన జగనన్నకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా విఫలమయ్యారని, కానీ జగనన్న మాత్రం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అలాగే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామియాదవ్, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని వెదురుకుప్పం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ శిల్ప ఆధ్వర్యంలో ఏపీకీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురువేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, నాయకులు పెద్దిరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి, లక్ష్మీరాజపేట పంచాయతీల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను సర్పంచ్ చిన్ని, ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్ ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించి గడప గడపకు వెళ్లి సంక్షేమ సారథి జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వైస్ సర్పంచ్ మోహన్, మాజీ సర్పంచ్ అంకయ్య, జేజేలురెడ్డి, సురేష్, మాసలామణి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, పలువురు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురం సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ మణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, వలంటీర్లకు జగనన్నే మా నమ్మకం కిట్లను అందించారు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ఏసమ్మ, సర్పంచులు చిట్టి, విజయ, అనిత, తహసీల్దార్ బెన్నురాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, నాయకులు అనంతరెడ్డి, గురవారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్ మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఎంపీపీ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనిత మాట్లాడుతూ సీఎం జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చారని అన్నారు. అనంతరం సచివాలయంలో మండల నాయకులతో కలిసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, గ్రామంలో పార్టీ జెండా ఎగుర వేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.









శ్రీరంగరాజపురం: కిట్లు అందుకుంటున్న వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, జెండా ఆవిష్కరణ, కార్వేటినగరం: గోపిశెట్టిపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, శ్రీరంగరాజపురంలో..

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం 30వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

నగరిలో..

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

క్రీడాకారుల వివరాల నమోదుపై సమీక్ష



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో క్రీడాకారుల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడుదాం.. ఆంధ్ర క్రీడాపోటీల్లో పాల్గొనాలంటే క్రీడాకారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అందుకోసం వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అవగాహన కల్పించి ఆసక్తి ఉన్నవారి వివరాలను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ, విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి

- నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి



సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న మధుసూదన్ రెడ్డి

పుత్తూరు: సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మరోమారు ఏపీకి జగనన్న సీఎం కావాలని నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన తిరుమలకుప్పం సచివాలయ ఆవరణలో గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమాభివృద్ధి లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించి ప్రజాతీర్పును కోరారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడి మోములో చిరునవ్వు అలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పనుల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష పార్టీ అసత్యపు ప్రచారాలు నిర్వహిస్తోందని తెలిపారు. దీన్ని తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న సంతోషం ఇలాగే కొనసాగాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందేనని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



వైద్యాధికారులతో చర్చిస్తున్న సీహెచ్‌సీ వైస్ చైర్మన్ బాలాజీ

కార్వేటినగరం: వైద్యాధికారులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ ఆర్.బాలాజీ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి 50 పడకల ఆస్పత్రిని తీసుకొచ్చారని, అయితే సీహెచ్ఎస్‌లో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయని చెప్పారు. అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. రాత్రి పూట కూడా సిబ్బందితో పాటు ఒక వైద్యుడు తప్పక అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అలా కాకుండా రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ మురళి, పలువురు సిబ్బంది ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిపట్టాలు



ఇంటి పట్టా అందిస్తున్న తహసీల్దార్ బాబు, అన్నలగన్, శేఖర్, మహేష్‌బాబు

పాలసముద్రం: మండల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇంటిపట్టాలు ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు అన్నలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబు సమీక్షంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. గ్రామంలో కాపురం ఉండి వారికి వివాహమై ఇల్లు లేకుండా ఇబ్బంది పడుతున్న వారు ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే వీఆర్ఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి ఇంటిపట్టాలు ఇస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ బాబు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇంటి పట్టాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, వీఆర్ఓ తంగరాజ్ పాల్గొన్నారు.

వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోండి

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నివారణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవోఏ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్‌లో సమస్యను నమోదు చేస్తే పోలీస్, రెవెన్యూ, సంక్షేమశాఖ, జ్యుడీషియల్ విభాగాలకు సమస్య సమాచారం తెలుస్తుందని వెల్లడించారు. దీంతో సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని వివరించారు.

ప్లే మెటీరియల్‌ను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

నగరి: పాఠశాలలకు అందించిన ప్లే మెటీరియల్స్‌ను వినియోగించుకోవాలని ఎంఈఓలు పీఎస్ శ్రీదేవి, నమశ్శివాయం తెలిపారు. బుధవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్‌జీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో వారు పీఆర్సీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న నూతన విద్యా విధానంపై, తెలుగు పాఠ్యాంశాలపైన ఏ విధంగా పాఠ్యాంశాలను బోధించాలో క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం ప్రతి పాఠశాలకు ప్లే మెటీరియల్స్ అందజేయడం జరుగుతుందని, వాటిని విద్యార్థులు వినియోగించుకునేలా చేయాలన్నారు. ప్రతి రోజూ ఆటవస్తులను వినియోగించుకోవాల్సిన విధానాన్ని పీడీ సురేష్ స్పష్టం చేశారు.

సన్న జీవాల పెంపకంలో మెలకువలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

- జేడీ ప్రభాకర్

గంగాధర నెల్లూరు: సన్న జీవాల పెంపకంలో మెలకువలు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా.ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సన్నజీవాల పెంపకంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభదాయకమైన గొర్రెల పెంపకంలో రైతులకు ఇస్తున్న సలహాలు, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలని, మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేళ్లు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. అంటువ్యాధుల బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. గొర్రెల్లో పారుడు వ్యాధి, గాలికుంటు వ్యాధి, చిటుక వ్యాధి, బొబ్బ వ్యాధి, నీళ్ల నాలుక వ్యాధి, ఆంథ్రాక్స్ పిరుదులు తదితర వాటి నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులకు అందించే చికిత్సా విధానం, సలహాలు సూచనలు ఇచ్చారు. సన్న జీవాల పెంపకంపై భారీ ప్రోత్సాహకాలతో, సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు మండల ఏడీ మురళీ మోహన్, నంద్యాల జిల్లా ప్యాపిలి గొర్రెల పెంపకదారుల శిక్షణా తరగతుల సంచాలకులు డా.శ్రీనివాస్‌రెడ్డి, పుత్తూరు డీడీ డా.గోవిందయ్య, చిత్తూరు ఏడీ డా.చంద్రశేఖర్ తో పాటు రైతులు, పెంపకందారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

- సీఎం జగన్ పాలనపై సర్వత్రా హర్షం
- కశింమిట్ట సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్



నగరి: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ నాయకులు





వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తున్న కౌన్సిలర్లు, నెట్టేరి సచివాలయ పరిధిలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

నగరి: ప్రతి ఇంటిలో సీఎం జగనన్న అమలు చేసిన నవరత్నాల వెలుగులు నింపాయని, అందుకే ఆయనను సీఎంగా మళ్లీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి అన్నారు. కశింమిట్ట సచివాలయ పరిధిలో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.19.25 కోట్ల మేర సంక్షేమం, రూ.4.69 కోట్ల మేర అభివృద్ధి జరిగిందన్నారు. వాటిని ఆధారాలతో వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు ఇంద్రారెడ్డి, యాకోబ్, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సచివాలయ అడ్మిన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మంచి జరిగిందని భావిస్తేనే ప్రజలు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఎంపీపీ దీప అన్నారు. మండలంలోని నెట్టేరి సచివాలయంలో సర్పంచ్ గౌరి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు అందించి వారిని ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నదే అని అన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించడం ద్వారా సీఎం జగనన్న గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించారని అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ పరిధిలో అందిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఎగురవేశారు. ఎంపీడీఓ అరుణ, వైస్ ఎంపీపీ శుభ, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం పాల్గొన్నారు.

ఓజీ కుప్పం దొంగ అరెస్టు

- రూ.25 లక్షల విలువైన నగలు స్వాధీనం



నిందితుడు గిరికుమార్, స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

యశవంతపుర (బెంగళూరు): వ్యక్తులను ఏ మార్చి దోపిడీకి పాల్పడుతున్న ఓజీ కుప్పం దొంగ పట్టుబడ్డాడు. వ్యాపారవేత్తను దృష్టి మరల్చి నగలు కాజేసిన నగరి మండలానికి చెందిన గిరికుమార్ (41) అనే దొంగను బెంగళూరులోని కెంగేరి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.25 లక్షల విలువైన 449 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు పశ్చిమ విభాగం డీసీపీ ఎస్.గిరిశ్ బుధవారం వివరాలు వెల్లడించారు. కెంగేరికి చెందిన పారిశ్రామికవేత్త రాజేశ్ శ్రీవాస్తవ్ నెల రోజుల క్రితం తన భార్యతో కలిసి కారులో వెళ్తూ ఏదో పనిపై మైసూరు రోడ్డు బీడీఏ అపార్ట్‌మెంట్ దగ్గర వాహనాన్ని నిలిపారు. అక్కడే పొంచి ఉన్న నిందితుడు గిరికుమార్ 'మీ కారు పంక్చరైంది' అని చెప్పి వారి దృష్టి మళ్లించాడు. తరువాత కారులో ఉన్న 500 గ్రాముల బంగారు నగల సంచితో ఉడాయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కెంగేరి పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

మనసున్న మంత్రి రోజమ్మ

"మంత్రి రోజమ్మ మనసు చాలా మంచిది.. మేము గర్భిణులు చాలామంది ప్రతి బుధవారం ఇక్కడ ఉండే ప్రభుత్వ ఆస్పత్రికి చెకప్ కోసం వస్తాం.. అయితే చాలాసేపు మేము ఇక్కడ ఎదురు చూడాల్సి వస్తుంది. దీంతో మాకు ఆకలి వేసినా అలాగే ఉండేవాళ్లం.. మా ఇబ్బంది తెలిసి ఒక మహిళగా మంత్రి రోజమ్మ మాకు చాలా రోజుల నుంచి కడుపు నిండా భోజనం పెట్టిస్తోంది. పది కాలాల పాటు చల్లగా ఉండాలి మా రోజమ్మ" అంటూ పలువురు గర్భిణులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి పరీక్షల వచ్చిన వారు కొనియాడారు.

–పుత్తూరు

